
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం KHAMMAM

బుధవారం, 7 మే 2025

ఎలుగుబంటి దాడిలో వ్యక్తి మృతి

ఏన్కూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం ఏన్కూరు మండలం కొత్తమేడేపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొత్త మేడేపల్లి గ్రామానికి చెందిన మడకం సోనూర్(40) ఎలుగుబంటి దాడిలో మృతిచెందాడు. మృతుడు సోమార్ మేకల కాపరిగా జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 5వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలు అంజలి, సంధ్యతో కలిసి మేకలను తోలుకుని, మేతకోసం అటవీ ప్రాంత సమీపంలోకి వెళ్లాడు. అకస్మాత్తుగా తండ్రిపై ఎలుగుబంటి దాడిచేయడంతో భయంతో ఇద్దరు పిల్లలు పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చి తల్లితో చెప్పారు. వెంటనే తల్లి గ్రామస్థులతో కలిసి వెళ్లారు. తీవ్రగాయాలైన సోనూర్‌ను చికిత్స కోసం కొతగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 8గంటల ప్రాంతంలో మడకం సోనూర్ మృతిచెందాడు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు సీఐల బదిలీ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ సోమవారం రాత్రి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం ట్రాఫిక్ సీఐ జె.మోహన్‌బాబును ఖమ్మం త్రీటౌన్‌కు, త్రీటౌన్ సీఐ దోమల రమేష్‌ను ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌కు, టాస్క్‌ఫోర్స్ సీఐ జె.రామకృష్ణను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, వెయిటింగ్‌లో ఉన్న తాటి పాముల కరుణాకర్‌ను వన్ టౌన్ సీఐగా, వన్ టౌన్ సీఐ వి.ఉదయ్‌కుమార్‌ను సీసీఎస్ ఖమ్మానికి, సీసీఎస్ సీఐ బి.బాలాజీని ఐజీ కార్యాలయానికి, టాస్క్‌ఫోర్స్ ఖమ్మం సీఐ ఎస్.తిరుపతిని ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.



వైరాలో నీట తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



ఖమ్మంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

ప్రకృతి బీభత్సం

నిమిషాల వ్యవధిలోనే గాలి వాన ప్రతాపం ● అల్లాడిపోయిన పలు ప్రాంతాలు

ఖమ్మం జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం భారీవర్షం దంచికొట్టింది. గాలి దుమారం, ఉరుములు మెరుపులతో వర్షం పడింది. కొన్నిచోట్ల భారీగా, కొన్నిచోట్ల స్వల్పంగా పడిన వర్షం రైతులకు కష్టం, నష్టం కలిగించింది. జిల్లా కేంద్రం ఖమ్మంతోపాటు పలు మండలాల్లో భారీగా వర్షం కురిసింది. అక్కడక్కడ ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతకాని మండలంలో వ్యవసాయ వ్యర్థాలను తగులబెడుతుండగా గాలిదుమారంతో సమీపంలోని మొక్కజొన్న కుప్ప మీద పడడంతో సుమారు రూ.5లక్షల విలువైన మొక్కజొన్నపంట దగ్ధమైంది.

- భయభ్రాంతులకు గురి చేసిన వడగండ్లు
- పలుచోట్ల నీటిపాలైన ధాన్యం రాశులు
- విరిగిపడిన కరెంటు స్తంభాలు, చెట్లు, హోర్డింగులు
- గంటపాటు స్తంభించిన జన జీవనం
- వైరా, కొణిజర్లలో వర్ష బీభత్సంతో హడలిపోయిన జనం



తనికెళ్లలో టార్పాలిన్లపై వర్షపు నీరు

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వైరా/తల్లాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో పలుచోట్ల ప్రధాన రహదారులకు అడ్డంగా చెట్లుపడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బలమైన గాలులకు చెట్లు ఊగిపోయాయి. అంతే స్థాయిలో వర్షం కురుస్తుండటంతో జనం హడలిపోయారు. పలు చోట్ల విద్యుత్ స్థంభాలు, ఒరిగిపోవటం, తీగలు తెగటంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఖమ్మం పాత బస్టాండ్‌లోకి వరద నీరు చేరటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మామిళ్ల గూడెం రైల్వే అండర్ బ్రిడ్జివద్ద వరదనీరు చేరటంతో మామిళ్ల గూడెం, సారథినగర్ ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.. మరో వంక ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ మార్పు సాంత్వన కలిగించింది.. గాలి వానా కారణంగా ఎండ వేడిమి పూర్తిగా తగ్గిపోయి అహ్లాదకర వాతావరణం ఏర్పడటంతో మరో వంక వేసవి ఉపశమనం లభించింది..వరుసగా ప్రతిరోజు పగలంతా ఎండ. సాయంత్రం , అర్ధరాత్రి వర్షాలు పడడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధన్యాం అలాగే ఆరబోసుకున్న మొక్కజొన్నలు తడిచి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

వైరాలో గాలివాన బీభత్సం

వైరాలో మంగళవారం సాయంత్రం భారీ గాలిదుమారం, వాన బీభత్సం సృష్టించాయి. కేవలం 30నిమిషాల్లోనే ప్రజాజీవనం అతలాకుతలమైంది. ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. రోడ్లపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. దాంతో జాతీయ ప్రధాన రహదారిపై కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. కరెంట్ తీగెలు తెగిపోయి సరఫరా నిల్చిపోయింది. ఓ చర్చి పైకప్పు సహా పలు రేకుల షెడ్లు, పహరీగోడలు నేలమట్టమయ్యాయి. నలు దిక్కుల నుంచి భారీ ఈదురుగాలులతో అదే రీతిలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం ఐదున్నరగంటల వరకు (మిగతా 6వ పేజీలో)

వణికిన నగరం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 6 (ఆంధ్రజ్యోతి): మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సంభవించిన గాలి దుమారం, రాళ్ల వర్షంతో ఖమ్మం నగరం వణికిపోయింది. జనం భయభ్రాంతులకు గురయ్యారు చూస్తుండగానే చెట్లు, కరెంటు స్థంభాలు నేలకూలాయి. జడ్పీక్వార్టర్స్ వృక్షాలు పడిపోయి నివాసాల నుంచి ఉద్యోగులు బయటకు రావటానికి ఇబ్బంది పడ్డారు. గాలి తీవ్రతతో నగరంలో సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలపై భారీ ఫ్లెక్సీలు పడ్డాయి. 20కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని విద్యుత్‌శాఖ అధికారులు గుర్తించారు. ప్రకృతి బీభత్సం సృష్టించిన అస్తవ్యస్త పరిస్థితులను సరిదిద్దడానికి ఖమ్మం నగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు రాత్రి 10గంటల వరకు పనిచేశాయి. మామిళ్లగూడెం రైల్వే అండర్ బ్రిడ్జివద్ద వరదనీరు చేరటంతో మామిళ్ల గూడెం, సారథినగర్ ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురయ్యాయి.



ఖమ్మంలో జలమయమైన ప్రధాన రహదారి

కొణిజర్లలో ఆగమాగం

కొణిజర్ల, మే 6(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలంలో గాలితో కూడిన వాన అరగంట సేపు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. మంగళవారం సాయంత్రం సంభవించిన గాలివాన బీభత్సంతో ధాన్యం రైతులు పరుగులు తీస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ధాన్యంపై పట్టాలు కప్పినా కొన్ని చోట్ల ఫలితంలేకుండా పోయింది. ధాన్యంలో వర్షపునీరు చేరింది. రైతులు వర్షంలోనే పట్టాలపై నిలిచిన నీటిని బయటకు వెళ్లదీసేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. అకస్మాత్తుగా వచ్చిన గాలివాన బీభత్సానికి ప్రజలు ఇండ్లలో నుంచి అరగంట సేపు బయటకు రాలేకపోయారు. మెయిన్‌రోడ్డు పక్కన, గ్రామాలలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. వాహనదారులు ఎక్కడవాహనాలు అక్కడ నిలిపివేయడంతో చెట్టుకొమ్మల ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాలి బీభత్సానికి చెట్ల కొమ్మలు విద్యుత్‌తీగలపై పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వడగండ్లతో వర్షం పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులివ్వండి

- 'సీతారామ' కు సవరించిన అంచనాలు మంజూరు చేయండి
- ఎన్‌ఎస్‌పీ కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించండి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి



ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులతో సమావేశమైన మంత్రి తుమ్మల

ఖమ్మం/కొత్తగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని, సవరించిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనాలకు మంజూరు ఇవ్వాలని, పెదవాగు, వెంగళరాయసాగర్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. మంగళవారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందించారు. గత సెప్టెంబరులో కురిసిన అకాలవర్షాలతో పోటెత్తిన వర్షంతో నాగార్జునసాగర్‌కాలవలకు పలుచోట్ల గండి పడి దెబ్బతిన్నాయని వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయించాలని కోరారు. రానున్న నెలరోజుల్లో వానాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో (మిగతా 6వ పేజీలో)

జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి తుమ్మల వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి గడ్కరీ

6



కొత్తగూడెంలో మావోయిస్టుల వివరాలను తెలుపుతున్న ఎస్పీ రోహిత్ రాజు

14మంది మావోయిస్టుల లొంగుబాటు

- అందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసులే
- లొంగిపోయిన వారిలో ముగ్గురు మహిళలు

వివరాలు : 6లో



కూసుమంచిలో సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అప్పులపాలు

- మాయమాటలు చెప్పడం వారికే అలవాటు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో

రూటు మార్చారు



ఇసుక అక్రమ రవాణాలో సీజ్ చేసిన ఎస్కార్ట్ వాహనాలు

- గంజాయి, ఇసుక అక్రమ రవాణాలో హైటెక్ పద్ధతులు
- ఇన్‌స్టాగ్రామ్ కాల్స్ ద్వారా గంజాయి విక్రయం
- మైవీల్స్ యాప్ ద్వారా ఇసుక అక్రమ రవాణా
- ఆంధ్రాలోని వేమనపల్లి, కాసరబాద్‌లో కృష్ణ నది నుంచి తెలంగాణకు ఇసుక
- ఇసుక లారీలకు ఎస్కార్ట్‌గా ఎక్స్‌యూవీ 700 కారు

మధిర టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): మధిర అడ్డాగా జరుగుతున్న ఇసుక, గంజాయి అక్రమ రవాణాలో నిందితులు.. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు హైటెక్ పద్ధతులు అవలంబిస్తున్నారు. మధిరలో ఇటీవల ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో విస్తుబోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణానది పరివాహకంలోని వేమనపల్లి, కాసరబాద్ నుంచి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, వైరా, మధిర పరిసర ప్రాంతాలకు నిత్యం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం వెలుగు చూసింది.

ఇసుక అక్రమ రవాణా విషయంలో అక్రమార్కులు కొత్త పుంతలు తొక్కుతున్నారు ఆంధ్ర నుంచి వచ్చే ఇసుక టిప్పర్ల లారీల డ్రైవర్లకు తమ ఫోన్‌లలో మైవీల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. లారీలకు ముందు ఎస్కార్ట్ గా వచ్చే ఖరీదైన కార్లలో ఉన్న వారు కూడా ఇదే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. ఈ యాప్ సాయంతో పోలీస్ చెక్‌పోస్టులకు చిక్కకుండా ఉండే రూట్లను ఎంపిక చేసుకుని ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. అంతే కాకుండా అటు టిప్పర్లలో ఉన్న వారు, ఇటు ఎస్కార్ట్ కార్లలో ఉన్న వారు అండ్రాయిడ్ ఫోన్లతో పాటు బటన్ ఫోన్‌లను కూడా ఉపయోగిస్తున్నారు. ఎక్కడన్నా పోలీసులు తారస పడితే ముందుగా కారులో ఉన్న వారు వెంటనే బటన్ ఫోన్‌తో టిప్పర్‌లో ఉన్న బటన్ ఫోన్‌కు రింగిస్తారు. ఫోన్ మోగిన వెంటనే టిప్పర్ల డ్రైవర్లు వెంటనే రోడ్డు పక్కన నిలిపివేసి రూట్ క్లియర్‌గా ఉన్న తరువాతనే తమ వాహనాలు పోనిస్తారు.

ఒక్కోసారి తెలంగాణ వే బిల్లుతో ఇసుక రవాణా చేసే లారీల వారి దగ్గర నుంచి వారు ఇసుక అన్‌లోడ్ చేశాక, ఆ వే బిల్లును తీసుకుని ఆ వే బిల్లు మీద ఉన్న లారీ నెంబర్‌ను ఆంధ్రా నుంచి అక్రమ ఇసుకతో వచ్చే వాహనాలకు అదే లారీ నెంబర్ ప్లేటు బిగించుకుని దర్జాగా ఆంధ్రా ఇసుకను తెలంగాణలో విక్రయిస్తున్నారు. ఆంధ్రా నుంచి వచ్చే ఇసుక లారీలకు ఎస్కార్ట్‌గా రూ.20లక్షల నుంచి రూ.30లక్షలకు పైగా విలువ చేసే కార్లు వినియోగిస్తున్నారంటే వీరి దందా ఏ రెంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

గంజాయి రవాణాలో కొత్త పుంతలు...

ఒడిసా నుంచి గంజాయిని తీసుకొని వచ్చి మధిరలో విక్రయించే వారు కూడా నూతన సాంకేతికతను వాడుతున్న విషయం పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. మధిరలో తరచూ గంజాయి విక్రయించే వారిని పోలీసులు గుర్తించడంతో వారి నెంబర్లను ట్రేస్ చేస్తారని తెలుసుకుని వారి ఫోన్లలో సిమ్‌కార్డులు తీసివేశారు. పక్క వారి హాట్‌స్పాట్‌ను వాడుకుని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయి కావల్సిన వారికి కాల్ చేసి విక్రయిస్తున్నారు. వీరు ఎక్కడ (మిగతా 6వ పేజీలో)



రామయ్య హుండీ ఆదాయం రూ.1.76 కోట్లు

- శ్రీరామ నవమి వేడుకతో భారీగా కానుకలు

భద్రాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి రూ.1,76,00,347 హుండీ ఆదాయం వచ్చింది. మంగళవారం ఆలయ ఆవరణలోని చిత్రకూట మండపంలో ఆలయ హుండీలను తెరిచి ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఇందులో రూ.కోటి76లక్షల నగదు, 115 గ్రాముల బంగారం, 1390 గ్రాముల వెండి లభించింది. కాగా, ఆలయ హుండీలను చివరగా మార్చి (మిగతా 6వ పేజీలో)

జూన్ 14న జాతీయ లోక్‌అదాలత్

ఖమ్మం లీగల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశానుసారం జూన్ 9 నుంచి 14 వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. అందులో భాగంగా మే 5 నుంచి మే 19 వరకు ముందస్తు జాతీయ లోక్‌అదాలత్‌ను జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక లోక్ అదాలత్‌ను దృష్టిలో (మిగతా 6వ పేజీలో)

పైరవీలు చేస్తానంటూ...



- సింగరేణిలో వసూళ్లకు పాల్పడిన డ్రైవర్
- బదిలీలు, ఉద్యోగాల పేరుతో ఎర
- అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు

కొత్తగూడెం టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తా.. బదిలీలు చేయిస్తా.. పదోన్నతులు కల్పించేందుకు తనకు ఉన్నతాధికారుల వద్ద పలుకుబడి ఉందంటూ కార్మికులను నమ్మించి అక్రమాలకు పాల్పడుతున్న సింగరేణి కొత్తగూడెం మెయిన్ వర్క్‌షాపులోని ఓ డ్రైవర్‌ను ఏసీబీ (మిగతా 6వ పేజీలో)

చర్చనీయాంశమైన ఆంధ్రజ్యోతి కథనం

భద్రాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపో ఉద్యోగులపై ఓ కీలక అధికారి తన ప్రతాపం చూపిస్తున్నారంటూ సారూ..మారదా తీరూ! అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ కథనంపై ఆర్టీసీ ఉద్యోగులు సదరు అధికారి తీరుపై అంతర్గతంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం అక్షరసత్యమని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉండగా డే అవుట్ పరిధి ప్రతి రోజు 240 కి.మీ. ఉండగా దానిని 360 కి.మీ.కి పెంచుతు డిపోలోని ఓ కీలక అధికారి తీసుకున్న నిర్ణయం మంగళవారం నుంచి అధికారికంగా అమలైనట్లు ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విధానంను భద్రాచలం -రాజమండ్రి-ఖమ్మం వెళ్లిన డ్రైవర్లకు అమలు చేస్తున్నట్ల సమాచారం. కాగా ఆర్టీసీ నిబంధనల ప్రకారం డే అవుట్ పరిధి తగ్గిస్తే డిపో పరిధిలోని ఉద్యోగులకు తెలియజేయాల్సి ఉండగా ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతో ఆర్టీసీ వర్గాలు అసహనం వ్యక్తంచేస్తున్నాయి.

ప్రతి సాగుదారుడికో సంఖ్య

- రైతుల నమోదు తప్పనిసరి
- మే 5 నుంచి జూన్ 5 వరకు నమోదు
- కొనసాగుతున్న ప్రక్రియ

ఖమ్మం వ్యవసాయం, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి రైతుకూ ఒక విశిష్ట సంఖ్య ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్రం ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఆధార్‌తో ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 నంబర్లతో కూడిన సంఖ్య ఇస్తారు. ఇందుకు సంబంధించి పలు రాష్ట్రాలలో ఇప్పటికే రైతు రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తయింది. ఖమ్మం జిల్లాలో మే 5వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు నమోదు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారు జిల్లా స్థాయిలో ఏవో, ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు. వీరంతా రైతులను చైతన్యపరిచి తమ భూముల వివరాలను సరిచూసి నమోదు చేయించాలి. రైతులకు ఉన్న భూమి వివరాలను రెవెన్యూ శాఖ నుంచి తీసుకుని ఆధార్‌తో అనుసంధానం చేసి రైతుకు ఐడీ కేటాయిస్తారు. ఇక నుంచి కేంద్రం ప్రకటించే పథకాలన్నీ ఈ ఐడీ నుంచి అమలవుతాయి. పీఎం కిసాన్ లబ్ధిదారులు వచ్చే విడత లబ్ధి పొందడానికి ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేసింది. అందుకే రైతులంతా ఏఈవోల వద్దకు వచ్చి నమోదు చేయించుకుని ఐడీ పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఈ ఐడీతో సంబంధం లేదు. ఇతర రాష్ట్రాల్లో మీ సేవ, ఇంటర్‌నెట్ కేంద్రాలలో రిజిస్టర్ చేయించారు. మన దగ్గర వ్యవసాయ, రెవెన్యూ శాఖ సర్వేలలో రైతు భూమికి సంబంధించిన పూర్తి డేటా ఉండటంతో ఏఈవోలు, ఏవోలకు అప్పగించారు.



ఏం చేయాలంటే...

రైతులు విశిష్ట సంఖ్యను పొందడానికి ముందుగానే ఆయా మండల వ్యవసాయాధికారులు ఏ రోజు ఏ గ్రామంలో పర్యటిస్తారో షెడ్యూలు ప్రకటిస్తారు. దాని ప్రకారం ఏఈవోలు వచ్చినపుడు రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకున్న సెల్‌ఫోన్‌ను తీసుకు వెళ్లాలి. అక్కడ ఏఈవో లాగిన్ చేసి ఆధార్ నమోదు చేస్తే అప్పటికే రైతు పేర ఉన్న భూమి వివరాలు ఉంటాయి. వాటిని సరి చూసుకోవాలి. అన్ని సరిగా ఉంటే విశిష్ట సంఖ్యను రిజిస్టర్ చేస్తారు. రైతు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేస్తే రైతుకు యూనికోడ్ వచ్చినట్లే. ఇదే విషయం సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ప్రతి రైతు రిజిస్టర్ చేసుకోవాలి. భవిష్యత్తులో అన్నింటికీ ఇదే ఆధారం కావచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను 60:40 నిష్పత్తిలో అమలు చేస్తుంటాయి. ఆయా పథకాలను ఈ యూనికోడ్ ఆధారంగానే నేరుగా లబ్ధిదారులకు అభివృద్ధి ఫలాలు అందేలా చేసేందుకే కేంద్రం దీన్ని తీసుకువచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో దివ్యాంగుడికి గోల్డ్ మెడల్


మెడల్ అందుకుంటున్న పాండురాజు

మణుగూరుటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యాం అడ్డుకాదు.. అకుంటిత దీక్షకు తిరుగు లేదు అని నిరూపించాడు ఓ గిరిజన దివ్యాంగ యువకుడు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన పర్సిక పాండురాజు పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. పాండు రాజు ఏడేళ్ల వయస్సులో ఖమ్మం జిల్లా పినపాక మండలం పాండు రంగాపురం వద్ద జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తన ఎడమ కాలును పూర్తిగా కోల్పోయాడు. అప్పటి నుంచి రాజు మణుగూరులోని ఓ దివ్యాంగుల ఆశ్రమంలో ఉంటూ స్థానిక జిమ్ ట్రైనర్ నాగరాజు వద్ద పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్, బాడీ బిల్డింగ్ విభాగాల్లో ఏడాది నుంచి శిక్షణ పొందుతున్నాడు. 2024లో ఖమ్మంలో క్లాసిక్ జిమ్ వారు నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రెండు సార్లు గోల్డ్ మెడల్ సాధించాడు. 2024 డిసెంబర్‌లో ఇల్లెందులో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని మూడో సారి కూడా గోల్డ్ మెడల్ సాధించాడు. 2025 రాష్ట్ర స్థాయిలో మెడ్చల్ జిల్లాలోని బాలానగర్‌లో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో కూడా గోల్డ్ మెడల్ సాధించాడు. ఇదే ఏడాది బోయిన పల్లిలో ఈ నెల మూడు నాలుగో తేదిల్లో జాతీయ స్థాయి మాజీ పవర్ లిఫ్టర్ బాలరాజు యాదవ్ స్మారకార్థం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 53 కేటగిరిలో 92.5 కేజీల విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పర్సిక పాండు రాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పారా ఒలింపిక్ పోటీల్లో పాల్గొని గొల్డ్ మెడల్ సాధించాలన్నదే తన జీవిత లక్ష్యం అన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా బెండాలపాడు ఎంపిక

- ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే

అశ్వారావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఇందిర సౌర జల వికాస పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలం, బెండాలపాడును ఎంపిక కావడం అదృష్టమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదినారాయణ ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలసి బెండాలపాడులో ఈనెల 10వ తేదీన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభోత్సవం చేయబోయే ప్రదేశాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోడు పట్టాలు పొందిన రైతులు వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ పథకానికి పైలెట్ ప్రాజెక్టుగ బెండాలపాడు గ్రామాన్ని ఎంపిక చేసారని, ఈనెల 10వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్నారని, ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విచారణకు పారిశుధ్య కార్మికులు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్ వద్ద విచారణకు పబ్లిక్ హెల్త్ వర్కర్లు హాజరయ్యారు. ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పారిశుధ్యంలో అవినీతి కంపు' కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. ఖమ్మం నగరంలో ఎంత మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లు వేతనాలు పొందుతున్నారు. వారిని ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లాను ఆదేశించారు. దీంతో పబ్లిక్ హెల్త్ వర్కర్లు కేఎంసీకి రావాలని ఆదేశించటంతో ఖమ్మం నగరంలో వేతనాలు పొందుతున్న వారిలో 60 మంది వరకు హాజరైనారు.

కదలలేని స్థితిలో ఉన్న వారికీ హాజరు

హాజరైన వారిలో ఎంతోమంది వృద్ధులు, కదల్లేని వారున్నారు. వారి స్థానంలో బంధువులు, కుటుంబ సభ్యులు విధులు నిర్వహిస్తున్నారు. కాని హాజరు మాత్రం ఉద్యోగం చేసే వారిది నమోదు చేస్తున్నారు. దీంతో ఒక్కో పబ్లిక్ హెల్త్ వర్కర్ రూ. 1లక్షకు పైగా వేతనాలు పొందుతున్నారు. వారి స్థానంలో బినామీ కార్మికులను వినియోగిస్తున్నారు. ఖమ్మం నగరంలో 90 మంది వరకు పబ్లిక్ వర్కర్లు పనిచేస్తున్నారని వారిలో 70శాతం మంది విచారణకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.


విచారణ చాంబర్ దగ్గర పారుశుధ్య కార్మికులు

సింగరేణిలో ఏసీబీ అలజడి

రుద్రంపూర్(సింగరేణి), ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఏసీబీ దాడులు జరపడంతో పైరవీకారుల్లో అలజడి మొదలైంది. సింగరేణి ప్రధాన ఆసుపత్రి మెడికల్ బోర్డులో అనేక అవకతవకలు జరుగుతున్నాయనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో పైరవీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారనే నెపంతో మెయిన్ వర్క్‌షాపులో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావు అనే వ్యక్తిని మంగళవారం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో పైరవీకారుల గుండెల్లో అలజడి మొదలైంది. సింగరేణి మెడికల్ బోర్డులో పలువురు పైరవీలు చేస్తున్నారనే ప్రచారం కొద్దికాలంగా జరుగుతోంది. అందులో భాగంగా ఇటీవల పదవీ విరమణ చేసిన చీఫ్ మెడికల్ ఆఫీసర్‌తో సన్నిహిత్యంగా మెలిగిన వారిపైన ఏసీబీ ఫోకస్ పెట్టింది. గడచిన మూడు నెలలుగా జరిగిన మెడికల్ బోర్డులో ఎంతమంది అన్‌ఫిట్ అయ్యారు.. వారికి ఉన్న వ్యాధులు ఏమిటి.. ఎవరు పైరవీలు చేశారనే అంశాలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ అధికారులు నివేదికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సింగరేణి మెడికల్ బోర్డులో కీలకపాత్ర పోషించిన వ్యక్తులు అన్‌ఫిట్ అయిన కార్మికులు, వారి నేపథ్యం మొదలైన అంశాలపై విజిలెన్స్ అధికారులు నివేదికను సిద్ధం చేసి విచారణ జరుపుతున్నారు. అన్‌ఫిట్ అయిన కార్మికులు ఇతర రంగాల్లో విధులు నిర్వహించడం, సింగరేణి ప్రకాశంగ్రౌండ్‌లో వాకింగ్ చేయడం తదితర అంశాలను సైతం పరిగణలోకి తీసుకుని అన్‌ఫిట్‌కు గల కారణాలపై విచారణ జరుపుతున్నారనే వార్తలు వస్తోన్నాయి. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలోని మెడికల్ బోర్డులో జరుగుతున్న అవకతవకలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించడం సింగరేణి వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే మెడికల్ బోర్డులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెక్యూరిటీకి చెందిన పలువురు ఉద్యోగులను ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సింగరేణి యాజమాన్యం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. బదిలిపై వెళ్లిన ఉద్యోగులు విధుల్లో చేరకుండ కొత్తగూడెంలోనే విధులు నిర్వహించేలా ప్రజాప్రతినిధుల ద్వారా సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏసీబీ దాడులు జరగడం అటు అధికారులు ఇటు పైరవీకారులకు చెమటలు పడుతున్నాయి. ఇదివరకే అరెస్టు అయిన ఉద్యోగి ద్వారా మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

ఖమ్మం, మే 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ఉపరితల రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. రహదారుల అభివృద్ధికి ప్రగతిబాట వేయాలని, ఈ సందర్భంగా జిల్లాలో జాతీయ రహదారుల పనులగురించి తుమ్మల ప్రస్తావించారు. జాతీయ రహదారుల అభివృద్ధితో రాష్ట్రాల మధ్య సంబంధాలు పెరిగి, వాణిజ్య, పర్యాటకరంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేకి రెండువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటుచేయడంతో నియోజకవర్గంలో గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, కేంద్రమంత్రికి వివరించారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వయా వైరా మీదుగా వంద కి.మీ జాతీయ రహదారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల రెండు తెలుగురాష్ట్రాల మధ్య దూరభారం తగ్గుతుందని, తెలిపారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంకు రవాణ సౌలభ్యం మెరుగుపడితే భక్తులకు ఉపయోగం కలుగుతుందని తెలిపారు.


కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం, మంత్రి తుమ్మల

కొత్తగూడెంగ్రీన్‌ఫీల్డ్ విమానశ్రయం ఏర్పాటవుతుందని ప్రయాణీకులకు సౌలభ్యంగా ఉంటుందని, ఎర్త్‌సైన్సు యూనివర్శిటీ ఏర్పాటవుతుందని ఇక్కడ చదివే విద్యార్థులకు ఉపయోగపడతుందని మంత్రి తుమ్మల వివరించారు. సింగరేణి గనుల నిలయమైన కొత్తగూడెంకు జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెంకు జాతీయ రహదారి నిర్మాణంతో రెండు తెలుగురాష్ట్రాల మధ్య వాణిజ్య పర్యాటకరంగాలు అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ఖమ్మం-కొరివి రోడ్డు నుంచి అమరావతి -నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కు 7కి.మీ లింక్‌రోడ్డు అనుసంధానం చేయాలని కోరారు. కాగా, తుమ్మల వినతికి గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

పైరవీలు చేస్తానంటూ...

(5వ పేజీ తరువాయి)

అధికారులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ విలేకరులకు తెలిపారు. కొత్తగూడెంలోని మెయిన్‌వర్క్‌షాపులో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ అన్నెబోయిన రాజేశ్వరరావు గత మూడు సంవత్సరాలుగా పైరవీలు చేస్తున్నట్లు యాజమాన్యం దృష్టికి రావడంతో సింగరేణి విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి కేసును ఏసీబీకి బదిలీ చేశారు. సింగరేణిలోని వివిధ ఏరియాలకు చెందిన అధికారులతో తనకు పరిచయాలు ఉన్నాయని, డబ్బులు ఇస్తే పనులు చేసి పెడతానని రాజేశ్వరరావు కార్మికులను నమ్మబలికి వారి నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. సుమారు రూ.32లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని, మిగతా వివరాలు విచారణ తర్వాత వెల్లడిస్తామన్నారు. రాజేశ్వరరావు ఎవరి ద్వారా లావాదేవీలు జరుపుతున్నారనే వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల నుంచి రాజేశ్వరరావు డబ్బు లావాదేవీలు జరిపినట్లు తమ విచారణలో తేలిందన్నారు. రాజేశ్వరరావుపై కేసు నమోదు చేసి వరంగల్ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు.

14మంది మావోయిస్టుల లొంగుబాటు

- అందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసులే
- లొంగిపోయిన వారిలో ముగ్గురు మహిళలు


లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు అందజేస్తున్న ఎస్పీ

కొత్తగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని హేమచంద్రాపురంలో ఉన్న జిల్లా పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎస్పీ రోహిత్ రాజు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసు అధికారుల సమక్షంలో మావోయిస్టు పార్టీకి చెందిన 14మంది సభ్యులు లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడించారు. జిల్లా పోలీసు, సీఆర్‌పీఎఫ్ పోలీసు బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు తెలుసుకుని ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకుని 14మంది మావోయిస్టు సభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ వివరించారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బీజాపూర్ జిల్లాకు చెందిన వారని ఎస్పీ తెలిపారు. సోడి బుద్ర, కల్మ హిడ్మా, పదం నందె, మడవి జోగా, కుంజా కోస, లేఖం సుక్రాం, పొడియం హిడ్మా, మడవి మంగా, కడితి నందె,కుర్సం సామయ్య, మడవి కమ, నూకో లక్మా, పొడియం జోగా, మడవి సహదేవ్ లొంగిపోయినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్‌శాఖ లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు పునరావాస సౌకర్యాలను అందజేస్తుందని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్‌లో పని చేసిన 227మంది మావోయిస్టు సభ్యులు వివిధ హోదాల్లో పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయే మావోయిస్టు సభ్యులు తమ దగ్గరలోని పోలీసుస్టేషన్, జిల్లా ఉన్నతాధికారుల వద్ద కానీ సంప్రదించవచ్చని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాత్‌కుమార్ సింగ్, 81 బెటాలియన్ అధికారి ఆర్‌ఎస్. శర్మ, 141 బెటాలియన్ అధికారి కమల్ వీర్ యాదవ్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులివ్వండి

(5వ పేజీ తరువాయి)

సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యగావాటిని మరమ్మతు చేయించాలని కోరారు.

అశ్వారావుపేట మండలంలో అకావలవర్షాలతో పెదవాగు ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో పాటు బండ్ తెగిందని, తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.3.50కోట్లు మంజూరుచేయాలని కోరారు. పెదవాగు ప్రాజెక్టు శాశ్వతల మరమ్మత్తులకు రూ.90కోట్ల నిధులు కావాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారని, ఇది ఏపీ, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టుగా ఉందని వివరించారు. తెలంగాణలో 2600ఎకరాలు సాగవుతుందని ఏపీలో 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఏపీ ప్రభుత్వంతో మాట్లాడి శాశ్వత మరమ్మత్తులకు నిదులు మంజూరుచేయాలని కోరారు. చంద్రుగొండ మండలం సీత గ్రామంలో వెంగళరాయసాగర్ ప్రాజెక్టు కూడా అకాలవర్షాలతో దెబ్బతిన్నదని, దీనిని మరమ్మత్తుల కోసం నిధులు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లాకు గోదావరి నదిజలాలు అందించే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలు మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం సీతారామ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు ఎస్‌ఆర్‌ఎల్‌ఐపీని చేపట్టిందని, గతంలో ఇచ్చిన అంచనాల ప్రకారం పనులకు ఆమోదం తెలిపిందని, రివైజ్‌డ్ అంచనాల ప్ర కారం అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. సీతారామ లిఫ్టుకోసం సవరించిన అం చనాలు పరిపాలన మంజూరుకు ఆర్థికశాఖ వద్ద పరిశీలనలో ఉందనరి, తక్షణం అనమతులు ఇవ్వాలని కోరారు. పరిపాలన అనుమతులతో పనులు త్వరగా పూర్తిచేసి సాగునీరు ఇ చ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ పూర్తయితే గోదావరి, కృష్ణాజలాలు పరవళ్లు తొ క్కనున్నాయని, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాకు కూడా సాగునీరు అందుతుందని సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుల నిర్మాణంతో జిల్లా ప్రజల లక్ష్యం, నాకల నెరవేరుతుందని సీఎంకి వివరించారు. ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడంతోపాటు జల విద్యుత్‌కూడా ఉత్పత్తి జరుగుతుందని అన్ని అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని కోరారు.

కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అప్పులపాలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేసీఆర్ పదేళ్ల పాలన అవినీతి మయమని, మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని రూ.8లక్షల కోట్ల పైచిలుకు అప్పులు చేసింది నిజం కాదా అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం కూసుమంచిలో పాలేరు నియోజకవర్గస్థాయి సంస్థాగత సమావేశంలో పాల్గొన్నారు. హనుమకొండ ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జ్ నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరాన్ని ఎనిమిదో వింతగా కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. రూ.లక్ష 20వేల కోట్లు వెచ్చించి కడితే కూలిపోతే చెప్పకుండా ఎలా ఉంటామని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక గత ప్రభుత్వంలో చేసిన అప్పులు వడ్డీలు కట్టడానికే బడ్జెట్ సరిపోతుందన్నారు. అప్పటి అక్రమాలను నిజాలుగా చెపుతుంటే.. ఉద్యోగ సంఘాలను సైతం రెచ్చగొడుతున్నారని, తిప్పికొట్టాలని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎన్నిడూ లేనివిధంగా నిరుద్యోగ సమస్యను తీర్చామని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా తీర్చినట్లు వివరించారు. వరంగల్ సభను అడ్డుకునేందుకు తాము ప్రయత్నించినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. తాము నిలువరించాలనుకుంటే బస్సులు ఎలా కేటాయిస్తామని ప్రశ్నించారు. ఖమ్మంలో రాహుల్ గాంధీ సభను అడ్డుకుంది ఎవరని ప్రశ్నించారు. దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉందని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని తెలిపారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని గ్రామ, మండల, నియోజవవర్గస్థాయిలో పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో పదవులు కావాల్సినవారు పార్టీ ఫార్మాట్‌లో బయోడేటా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణకుమారి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ. సీడీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, రామసహాయం నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి బీభత్సం

(5వ పేజీ తరువాయి)

ఎండలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఒక్కసారిగా నిమిషాల వ్యవధిలోనే వాతావరణంలో మార్పులు సంభవించి ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో వాన బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలులతో స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు.

వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని వేలాది బస్తాల ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. వరద నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. సిరిపురం, నారపనేనిపల్లి, పూసలపాడు, గరికపాడు, దాచాపురం, గన్నవరం, ఖానాపురం, ముసలిమడుగు, స్నానాల లక్ష్మీపురం, రెబ్బవరం, కొండకొడిమ, గొల్లపూడి, పాలడుగు, తాటిపూడి, సోమవరం, కొష్టాల, జింకలగూడెం గ్రామాల్లో రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాశులు మొ త్తం వర్షానికి తడిసిముద్దయ్యాయి. రైతులకు కోట్లాదిరూపాయల నష్టం జరిగింది. ధాన్యం రాశులు, కాంటా వేసిన బస్తాలపై కప్పిన టార్పాలిన్, పరదా పట్టాలు భారీ గాలులకు లేచిపోయాయి. దాంతో రైతులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. స్టేజీ పినపాక-వైరా మధ్య జాతీయ ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకూలాయి. దాంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. వైరాలో క్రాస్‌రోడ్డు వద్ద దుకాణాల ముందున్న భారీ వేపచెట్టు జాతీయ ప్రధాన రహదారిపై నేలకూలింది. ఈ భారీ వృక్షం కింద ఒక ద్విచక్రవాహనం పడిపోయి దెబ్బతింది. వైరా ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ తమ సిబ్బందితో కూలిన చెట్లను ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగించారు. స్టేజీ పినపాక వైపు పోలీసు వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

తల్లాడ మండలంలో వడగండ్ల వాన

తల్లాడ మండలంలో మంగళవారం ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. తల్లాడ, అన్నారుగూడెం, గోపాలపేట తదితర కొనుగోలు కేంద్రాలలో కల్లాల్లో ధాన్యం తడిచింది. కొన్ని చోట్ల ధాన్యం రాశులపై కప్పినపట్టాలపై వర్షపునీరునిలిచింది. మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రూటు మార్చారు

(5వ పేజీ తరువాయి)

కూడా డబ్బులు కాని, గంజాయి కాని వ్యక్తి నుంచి వ్యక్తికి చేతి ద్వారా ఇవ్వడం లేదు. ఫోన్‌పే ద్వారా డబ్బులు ముట్టాక ఎక్కడో ఒక చెట్టు తొర్రలోనో, బ్రిడ్జి సందుల్లోనో, రైల్వే కరంట్ పోల్ దగ్గరో పెట్టి ఆ విషయాన్ని చెబుతారు. మధిరలో గంజాయితో దొరికిన వ్యక్తులు మరో ఏడుగురికి గంజాయి విక్రయిస్తున్నట్లు చెప్పటంతో ఆ ఏడుగురులో కొందరు గంజాయి విక్రయిస్తు, మరి కొందరు గంజాయి సేవిస్తున్న వారేనని తెలింది. వీరిలో కొందరిపై బండి దొంగతనాల కేసులు కూడా ఉన్నాయి, వీరు దొంగలించిన బండ్లను ఒడిసాలోని మల్కనగిరి జిల్లా పుష్పలంకలో గంజాయి అమ్మే వారికిబండ్లు ఇచ్చి గంజాయి తెచ్చుకున్నట్లు కూడా సమాచారం. కొందరు పోలీసుల ఉదాసీనత వల్లనే.. వారికి తెలిసే ఈ దందా సాగుతున్నట్లు మధిరలో చర్చించుకుంటున్నారు.

మిట్టపల్లికి 9న కేటీఆర్ రాక

- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు విగ్రహావిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

తల్లాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన తల్లాడ మండలం మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు విగ్రహాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు ఆవిష్కరిస్తారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మిట్టపల్లిలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకపాత్ర పోషించిన రాయల వెంకటశేషగిరిరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆయన విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరిస్తారని తెలిపారు. 9వతేదీ ఉదయం 9గంటలకు హైదరాబాదు నుంచి హెలికాప్టర్‌లో కేటీఆర్ తల్లాడ మండలం అంజనాపురం వచ్చి అక్కడ నుంచి కారులో మిట్టపల్లి చేరకుంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో కేటీఆర్‌తోపాటు ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థ సారథిరెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

కాగా, మిట్టపల్లిలో విగ్రహావిష్కరణ సభావేదిక, అంజనాపురంలో ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా హెలీప్యాడ్ స్థలాలను తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లానాయకుడు తాళ్లూరి జీవన్‌కుమార్, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీలు కట్టా అజయ్‌బాబు, లక్కినేని రఘు సొసైటీ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకటరావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, దిరిశాల దాసురావు, కేతినేని చలపతిరావు, మువ్వా మురళీధర్‌రావు, నాయుడు శ్రీనివాసరావు, రాయల రఘునందన్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 14న జాతీయ లోక్‌అదాలత్

(5వ పేజీ తరువాయి)

పెట్టుకుని కక్షిదారులలో ఎవరైన న్యాయసేవాధికారసంస్థకు దరఖాస్తు చేసుకుంటే అట్టికేసులు ఏ కోర్టులో ఉన్న లీగల్ సర్వీస్ అథారిటీ వారు అట్టి కేసులను ఇరుపక్షాల వారితో పాటు వారి న్యాయవాదుల సమక్షంలో ఇరుపక్షాల వారికి ఆమోదయోగ్యంగా పరిస్కారం కనుగొనేందుకు ప్రయత్నం చేస్తారన్నారు. ఇరుపక్షాల సమక్షంలోనే రాజీ వివరాలను రాతపూర్వకంగా రాసి ఇరు వర్గాల వారికి అవార్డు కాపీని తక్షణమే అందజేసేందుకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ కృషిచేస్తుందన్నారు. చెల్లని చెక్కు కేసులను పైన తెలిపిన తేదీలలో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కోర్టులలో జూన్ 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ తెలిపారు. రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్, మోటారువాహన ప్రమాద కేసులతోపాటు బ్యాంక్ రుణాలకు సంబంధించి, వివాహ సంబంధ కేసులను పరిస్కరించుకోవచ్చని తెలిపారు.

రామయ్య హుండీ ఆదాయం రూ.1.76 కోట్లు

(5వ పేజీ తరువాయి)

20న లెక్కింపు నిర్వహించగా, 47 రోజుల అనంతరం లెక్కింపు నిర్వహించారు. 90 యుఎస్ డాలర్లు, 110 అరబ్ దీనార్స్, 30 యూరోపియన్ పౌండ్స్‌తో పాటు ఇతర దేశాల కరెన్సీ లభించాయి. ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరిగిన శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో హుండీ ఆదాయం అధికంగా సమకూరింది.

క్రైం సమాచారం

దైవదర్శనానికి వెళ్లి వ్యక్తి మృతి

» కేదార్నాథ్ వద్ద గుండెపోటుతో అశ్వారావుపేట వాసి మృతి


వెంకటేశ్వరరావు(ఫైల్)

అశ్వారావుపేట రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అశ్వారావుపేట భక్తుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తోటి భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట పట్టణానికి చెందిన గుత్తికొండ వెంకటేశ్వరరావు(48) వెల్డింగ్ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. శివమాల ధరించిన వెంకటేశ్వరరావు పట్టణానికి చెందిన మరో నలుగురితో కలిసి ఈనెల 1న దేశంలో వివిధ ప్రాంతాలు చూసేందుకు వెళ్లారు. ఢిల్లీతో పాటు వివిధ ప్రాంతాలను సందర్శించిన భక్తుల బృందం ఈనెల 4న గౌరికుండ్‌లో ఆలయాన్ని సందర్శించి 5న ఉదయం కేదార్నాథ్‌కు కాలినడకన బయలుదేరారు. 14కిలోమీటర్ల దూరం కొండల మీద నడిచారు. మరో రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న కేదార్నాథ్‌కు చేరుకునేందుకు సోమవారం రాత్రి కొండల మీదే నిద్రించారు. భక్తులు మంగళవారం ఉదయం తిరిగి నడక ప్రారంభించేందుకు వెంకటేశ్వరరావును నిద్ర లేవకపోవడంతో తోటి భక్తులు అతడిని పరిశీలించగా వెంకటేశ్వరరావు మృతి చెందినట్లుగా గుర్తించారు. నడకతో తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందినట్లుగా అనుమానించారు. పోలీసుల సహాయంతో ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా వెంకటేశ్వరరావును కొండ దిగువ ఉన్న ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమతో అప్పటివరకు మరో రెండు రోజుల్లో ఇంటికి వెళదామని అనుకుంటున్న తోటి భక్తులు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని అశ్వారావుపేటకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

జీవనోపాధి కోసం వచ్చి యువకుడు ..


నవీన్(ఫైల్)

తల్లాడ, మే6(ఆంధ్రజ్యోతి): జీవనోపాధికోసం మామిడికాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి లారీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం మండలంలోని రెడ్డిగూడెం వద్ద తల్లాడ-వరంగల్ జాతీయ రహదారిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌రోడ్ ఇందిరానగర్ కాలనీకి చెందిన యువకుడు ఆలకుంట నవీన్(20), అతడి చెల్లెలు అజితలు కలిసి ఆటోలో మామిడికాయలు కొనుగోలు చేసేందుకు తల్లాడ మండలం గాంధీనగర్‌తండాకు వచ్చారు. కొనుగోలు చేసిన మామిడికాయలను తీసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా రెడ్డిగూడెం వద్ద ఖమ్మం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొంది. ప్రమాదంలో ఆటో నడుపుతున్న నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న అజితకు గాయాలయ్యాయి. గాయపడిన అజితను చికిత్స కోసం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజే మృత్యు ఒడిలోకి ...

» ప్రమాదవశాత్తు డాబాపై నుంచి పడి వలసవాది


మృతేష్(ఫైల్)

పాల్వంచ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రం నుంచి పొట్ట కూటి కోసం వలస వచ్చిన ఓ వంట మాస్టర్ తన పుట్టిన రోజు నాడే మృత్యు ఒడిలోకి చేరుకున్న సంఘటన పాల్వంచలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మృతేష్(26), తన స్నేహితుడు హిమాన్షుదాస్‌తో కలిసి బతుకు దెరువు కోసం పాల్వంచకు వచ్చాడు. స్థానిక నటరాజ్ సెంటర్లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో వంట మాస్టర్లుగా విధుల్లో చేరారు. సోమవారం పని పూర్తి చేసుకుని అదే ప్రాంతంలో అద్దెకుంటున్న గదిలో పుట్టినరోజు సంబురాల్లో భాగంగా స్నేహితులిద్దరూ కలిసి మద్యం సేవించారు. అర్ధరాత్రి వారి గదికి చేరుకున్నారు. తమ గదిలోనే హిమాన్షుదాస్ నిద్రకు ఉపక్రమించగా, మృతేష్ మాత్రం ఉక్కపోత ఎక్కువగా ఉందని తాను పక్కన ఉన్న డాబాపైన పడుకుంటానని స్నేహితుడికి చెప్పి వెళ్లాడు. కాగా ఉదయం పక్కింటి డాబా యజమాని అబ్బు నాగేశ్వరరావు కిందపడి మృతేష్ మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతేష్ ఒక డాబా పై నుంచి మరో డాబాపైకి చేరుకునే క్రమంలో మద్యం మత్తులో జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. హిమాన్షుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌ఓ కళ్యాణి తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన అడవిదున్నలు

» ఇరువురికి గాయాలు


క్షతగాత్రుడిని ఖమ్మం తరలిస్తున్న 108సిబ్బంది

సత్తుపల్లిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): అడవిదున్నల మంద రోడ్డు దాటుతున్న క్రమంలో ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన సత్తుపల్లి మండలం యాతాలకుంటలో మంగళవారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం పెనగడపకు చెందిన ఐదుగురు కూలీలు పని నిమిత్తం సత్తుపల్లికి ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో యాతాలకుంట-చెరుకుపల్లి సమీపంలోకి రాగానే అడవిదున్నల మంద రోడ్డు దాటుతున్నాయి. మందలో ఒక అడవిదున్న ఆటోపైకి దూసుకువచ్చి దాడిచేసింది. డ్రైవర్ పల్లపు రాజును, కూలీ బోసు ఓదేలును కొమ్ములతో దాడిచేసి గాయపరిచింది. సమాచారం అందుకున్న 108సిబ్బంది ఈఎంటీ గొల్లమందల కృష్ణ, పైలెట్ రాధాకృష్ణలు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓదేలును ఖమ్మం తరలించారు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు తరచూ నీరు, మేత కోసం తిరుగుతుంటాయని, వాటికి హాని తలపెడితే చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ రేంజర్ స్నేహలత తెలిపారు.

సంప్రదాయ పంటలను కాపాడుకుందాం

» కలెక్టర్ జితేష్ వీ పాటిల్


అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పామ్‌పాండ్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

అశ్వారావుపేట, మే 6(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటల సాగుతో రైతులకు ఎంతో లాభదాయకమని కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు తవ్విన ఇంకుడు గుంతలను, పలు రకాల పంటల క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మునగపై ప్రత్యేక దృష్టి పెట్టి సాగుచేస్తే అధిక లాభాలను పొందవచ్చునన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా కొత్తగూడెం జిల్లాలోనే 500 ఎకరాలలో మునగసాగు జరుగుతుందని వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలకు మునగ ఎగుమతి చేసుకునే స్థాయికి రైతులు చేరుకోవాలన్నారు. మునగ ఆకులకు కూడా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఆకులను పొడి చేసే ప్రాజెసింగ్ కోసం సోలార్ డ్రయర్లను తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తక్కువ భూమి ఉన్న రైతులు ఒక ఎకరంలో మునగను పండించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. ప్రభుత్వం తరుపున వ్యవసాయ పంటలు అనేక రకాల రాయితీలు ఉన్నాయని, రైతులు వీటిని వినియోగించుకుంటూ ఒత్తిడి లేని వ్యవసాయాన్ని చేయవచ్చునన్నారు. సంప్రదాయ పంటలు, రకరకాల పంటలు సాగు చేసి లాభాలు పొందాలని అన్నారు. కళాశాలలోని వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు రైతులకు వీటిపై అవగాహన కల్పించాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలో సర్వే జరుగుతున్న 911,152 బ్లాక్‌లను సందర్శించి రైతులతో మాట్లాడారు. గొగులపూడి లో కొండరెడ్లతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గుబ్బలమంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తి చేయాలి

కొత్తగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పురోగతిలో ఉన్న ఇంకుడు గుంతల నిర్మాణం, పామ్‌ఫాండ్స్ నిర్మాణాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలప అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, వసతిగృహాలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అన్ని కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతి ఎకరానికి ఐదు ఇంకుడు గుంతలు అర ఎకరానికి మూడు ఇంకుడు గుంతలు తప్పని సరిగా ఉండేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. జెల్ సంచెయ్ జన్ భాగీదారిలో దేశంలోనే మొదటి స్థానంలో జిల్లాను నిలపాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వర్షం నుంచి వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యమైన భూముల్లో నీటి కుంట నిర్మాణానికి మార్కిం గ్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉందని దానిలో పదో వంతు 34వేల నీటి కుంటలు తవ్వకాలు చేపట్టాలని, 10 ఎకరాలకు ఒక నీటికుంట తప్పని సరిగా ఉండాల్సిందే అని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా రూపకల్పన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పూర్తైన జాబితాలను ఇన్‌చార్జ్ మంత్రి అనుమతి కోసం ప్రతి రోజు పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కర్రె గుట్టలో అమాయకపు ఆదివాసీ కుటుంబాలను చిద్రం చేసే విధంగా జరిగే కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపి వేయాలని పలు వురు అఖిలపక్ష నాయకులు అన్నారు. పట్టణంలోని వేణురెస్టారెంట్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య చారి, సీపీఎం సీనియర్ నేత నెల్లూరి నాగేశ్వరరావు, ఎన్డీ నాయకులు మధుసూధర్‌రెడ్డి, చంద్రం, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి మాట్లాడారు. దండ కారణ్యంలో మారణ హోమాన్ని కేంద్రం భారత సైన్యం ద్వారా జరిపిస్తోందని, వందలాది ఆదివాసీ కుటుంబాలకు తుపాకుల తూటాలకు బలైపోతున్నాయని అన్నారు. దేశ రక్షణ కోసం పోరాటాలు చేయాల్సిన జవాన్లతో మధ్య భారతంతో మారణహోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ కుటుంబాలపై హత్యకాండ జరుగుతున్నా ఆదివాసీ ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావులు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు, కగార్ ఆపరేషన్ నిలుపుదలే లక్ష్యంగా అఖిల పక్ష నాయకులు నియోజకవర్గంలోని మణుగూరు పట్టణంలో ఈ నెల 12న భారీ ర్యాలీని నిర్వహించబోతుందని ప్రకటించారు. మానవతా వాదులు ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని ఆదివాసీల రక్షణకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. మణుగూరులో జరిగే ఈ ర్యాలీ కేంద్రానికి శాంతి సంకేతానికి ప్రతీకగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే పాయం, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావులు ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

నాణ్యమైన ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలి

ఖమ్మం కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): వాస్తవ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పైలెట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతి, ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. పైలెట్ గ్రామాలలో 878 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే 409 ఇళ్లు బేస్మెంట్ స్థాయి వరకు నిర్మించామని, 370 లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత రూ.లక్ష ఆర్థిక సహాయం విడుదల చేసిందన్నారు. మిగిలిన గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ఒక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేసే ముందు సంబంధిత లబ్దిదారులకు, మేస్త్రీ లకు మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను చూపించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటిని ఎలా నిర్మించుకోవాలో హౌజింగ్ శాఖకు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన అసిస్టెంట్ ఇంజనీర్ ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాకు 14 వేల 763 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తే, 10 వేల 921 దరఖాస్తులు సర్వే చేసి 9 వేల 150 దరఖాస్తులకు అర్హత ఉన్నట్లు తెలిపారు.. తుది లబ్ధిదారుల జాబితా ర్యాండమ్‌గా చెక్ చేసి అర్హులకు మాత్రమే జాబితాలో చోటు కల్పించారా లేదా గమనించి వివరాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, పీడీ హౌసింగ్ బి. శ్రీనివాస్, డీఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఆర్డీఓ కల్లూరు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు పోస్టుల కేటాయింపు

భద్రాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ద్వారా హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టులకు ఎంపిక చేసిన అభ్యర్థులకు కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలో, వసతి గృహాలలో భర్తీ చేయడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ అన్నారు. మంగళవారం పీఎంఆర్‌సీ భవనంలోని సమావేశ మందిరంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపిక చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను అభ్యర్థుల వారీగా గత నెల 28న పరిశీలన చేసి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి పంపారు. వారి ఉత్తర్వుల మేరకు కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 23 పోస్టులకు కేటాయింపు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవోలు అశోక్‌కుమార్, డీడీ పీఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం కలెక్టరేట్, మే 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 8న ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి తెలిపారు. ఎంఆర్ఎఫ్ కంపెనీలో మెకానిక్ ఆపరేటర్‌గా సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో పని చేసేందుకు ఆసక్తి, అర్హత గల 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల యువతీ, యువకులు, 8వ, 9వ, 10వ తరగతి నుంచి 12 వ తరగతి , ఐ.టి.ఐ. ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.17 వేల వేతనం ఉంటుందని అన్నారు. మొత్తం 550 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

34 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

» లారీ సీజ్, ఎనిమిది మందిపై కేసు

» పట్టుబడిన బియ్యం విలువ రూ.12.36 లక్షలు


పట్టుబడిన బియ్యం లారీతో పోలీసులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వన్ టౌన్ సీఐ ఎం.కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం...కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్ఐసీ కార్యాలయ ప్రాంతంలో ఎస్ఐ విజయకుమారి తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సీజీ04 పీఎక్స్ 0717 అనే నెంబరు గల లారీ వెళ్తుండగా, దానిని ఆపి తనిఖీ చేశారు. లారీలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. 34 క్వింటాలకు సంబంధించి 687 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని లారీని సీజ్ చేసి, లారీలో ఉన్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణలో రేషన్ బి య్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల వద్ద నుంచి కొనుగోలు చేసి చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు బహిర్గతం అయిందన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.12.36 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చప్పిడి వెంకటకృష్ణ, చల్లగొల్ల రామ్మోహన్‌రావు, చత్తీస్‌గఢ్‌కు చెందిన భువనేశ్వర్‌సాహూ, చిత్రంజన్ తారక్‌లు ఉండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చిట్టెల రామ కనకాచారి, కృతిక గోస్వామి, లారీ డ్రైవర్ నాగరాజు, యజమాని పరం ప్రీత్‌సింగ్ ధనుంజల్ పరారీలో ఉన్నారని తెలిపారు. 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ రోహిత్‌రాజు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌లు అభినందించారు.

ఆఫీస్ సబార్డినేట్ ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సబార్డినేట్ కృష్ణమ్మ మంగళవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. లక్ష్మీనగరంలో తాను నివసిస్తున్న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ములకపాడు పీహెచ్‌సీకు తరలించారు. కాగా ఈ సందర్భంగా కృష్ణమ్మ ఫోనులో సంప్రదించగా తనను కార్యాలయ సిబ్బందిలో కొందరు అకారణంగా వేధిస్తున్నారని ఆరోపించింది. షోకాజ్ నోటీసులు, మెమోలు ఇచ్చి మానసిక వ్యధకు గురి చేస్తుండడంతో తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని తెలిపింది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా తాను గానీ, కార్యాలయ సిబ్బంది ఎవరూ కృష్ణమ్మను వేధించలేదని తెలిపారు.

పట్టాభిరామ్‌కు తప్పిన ప్రమాదం


నుజ్జునుజ్జైన కారు

కల్లూరు, మే6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాల గ్రామానికి చెందిన డీపీఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ యువ నాయకుడైన దేవరపల్లి పట్టాభిరామ్ సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణపాయస్థితి నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఖమ్మం వైపు నుంచి హైదరాబాద్‌కు కారులో ఆయనతో పాటుగా కారు డ్రైవర్ ఇద్దరు కలిసి ప్రయాణిస్తుండగా, చౌటప్పల్ టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ఆయన స్వల్పంగా గాయపడ్డారు. కారు నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలు కాగా వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వే బ్రిడ్జి ఆపరేటర్ల చేతి వాటం

సుజాతనగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండలంలోని పత్తి కొనుగోలు చేసే ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఓ వే బ్రిడ్జిలో ఆపరేటర్ల చేతివాటం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదు దారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఆ వే బ్రిడ్జి ప్రాంగణంలో మూడ్ భీమ్లా, కె. వెంకట కృష్ణారావులు పత్తి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో కాగా ఆ వే బ్రిడ్జి లో ఆపరేటర్లుగా పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పత్తి మార్కెట్‌కు పత్తి తెచ్చే 15 మినీ ఆటో వాళ్లతో కలిసి గత రెండు నెలలుగా తూకంలో మోసానికి పాల్పడుతున్నారని తెలిపారు. దీనితో తూకంలో దాదాపు రూ. 30 లక్షల వరకు మోసం జరిగిందని, వారిరువురిపై విచారించి తగు చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటవీ శాఖ అధికారులపై గొత్తికోయల దాడికి యత్నం

» పెనగడపలో సంఘటన » పోలీసులకు ఫిర్యాదు


రామవరం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ సిబ్బందిపై దాడికి ప్రయత్నిస్తున్న జగ్గారం గొత్తికోయలు

చుంచుపల్లి, మే6(ఆంధ్రజ్యోతి): ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ అటవీ భూముల సరిహద్దులను పరిశీలిస్తున్న సమయంలో అధికారులపై గొత్తికోయలు దాడికి ప్రయత్నం జరిగిన సంఘటన రామవరం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ పరిధి పెనగడపలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. రామవరం రిజర్వు ఫారెస్ట్ మునలివారే ఈస్టే బీట్ పెనగడప సెక్షన్ పరిధిలోని కంపార్ట్‌మెంట్ నెంబర్-9లో పరిరక్షణ, పర్యవేక్షణ నిమిత్తం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎల్లయ్య ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సరిహద్దులను పరిశీలిస్తుండగా జగ్గారం గొత్తికోయ గ్రామానికి చెందిన సుమారు వంద మంది అకస్మాత్తుగా ఒక గుంపుగా చేరి అటవీశాఖ అధికారులపై, సిబ్బందిపై దాడికి ప్రయత్నం చేశారు. దీంతో భయాందోళన చెందిన అధికారులు, సిబ్బంది ఆ గొత్తికోయలను వాదించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న వీరిని అడ్డుకున్నారు. ఎంతకీ సముదాయించిన వారు వినకపోవడంతో అధికారులు, సిబ్బంది తమ కార్యాలయానికి వెళ్లిపోయారు. ఇలా దాడికి ప్రయత్నం చేయడం దారుణమని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సీహెచ్.ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈ సంఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మొత్తం పది మంది అటవీ శాఖ అధికారులు ఫుట్ పెట్రోలింగ్ వెళ్లారు. వీరిలో పెనగడప ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పిల్లి సలుజా, బీట్ ఆఫీసర్లు కళ్యాణి, బేస్ క్యాంప్ వాచర్స్ ఉన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి దుర్మరణం

» కుమారుడి మృతికి కోడలే కారణమనే అనుమానంతో పోలీసులకు తండ్రి ఫిర్యాదు

జూలూరుపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తన కుమారుడి మృతికి కోడలే కారణమనే అనుమానం ఉందని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూలూరుపాడు పంచాయతీ పరిధిలోని దళిత కాలనికి చెందిన కత్తి అరవింద్(25)తో గత ఏడాది ఖమ్మం జిల్లా ఏన్కూర్ గ్రామానికి చెందిన ఎక్కిరాల సింధుతో వివాహనం జరిగింది. అరవింద్‌తో వివాహం చేసుకోవడం సదరు యువతికి ఇష్టం లేకపోయినప్పటికీ తల్లిదండ్రుల బలవంతం చేయడంతో వివాహం చేసుకుంది. ఆ తర్వాత భార్యభర్తల మధ్య తరుచూ వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో సింధు పుట్టింటికి వెళ్లిపోయింది. కొంత కాలం తర్వాత ఆమె ఈ ఏడాది ఏప్రిల్ 1న తిరిగి పుట్టింటి నుంచి జూలూరుపాడు అత్తగారింటికి వచ్చింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఏప్రిల్ 2న భర్త అరవింద్ తన భార్య సింధుతో నూడిల్స్ తెప్పించుకున్నాడు. ఇద్దరు కలసి తిన్నారు. అదే రోజు సాయంత్రం నుంచి అరవింద్‌కు వాంతులు అవ్వడంతో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు చేయించారు. అనంతరం కొత్తగూడెం, ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. కాగా ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 16న యువకుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని జూలూరుపాడుకు తీసుకువచ్చి ఖననం చేశారు. కాగా తన కుమారుడి మృతికి కోడలే కారణమనే అనుమానం ఉందని, దీనిపైన విచారణ జరపాలని తండ్రి కత్తి రాములు ఈ నెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు. కాగా ఖననం చేసిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి ఫోరెనిక్స్ బృందంతో పోస్టుమార్టం నిర్వహించారు.


యువకుడు అరవింద్‌ని ఖననం చేసిన ప్రదేశంలో పోలీసులు, గ్రామస్థులు

మొక్కజొన్న కుప్పల దగ్ధం

చింతకాని, మే 6 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో మొక్కజొన్న కుప్పలు దగ్ధమైన సంఘటన చింతకాని మండలం నర్సింహాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలోని వడ్డే వంశీకృష్ణకు చెందిన సుమారు 200క్వింటాళ్ల మొక్కజొన్న కుప్ప అగ్నికి ఆహుతైంది. పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో భారీగా వీచిన గాలులకు మొక్కజొన్న కుప్పతో పాటు రైతుకు చెందిన ద్విచక్రవాహనం కూడా దగ్ధమైంది.

ఈ ప్రమాదంలో సుమారు రూ.ఐదులక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వంశీకృష్ణ తెలిపారు. అలాగే ఆసమీపంలో ఉన్న దొడ్డా అచ్చయ్యకు చెందిన వందక్వింటాళ్ల మొక్కజొన్న కుప్ప కూడా దగ్ధమైంది. రూ.రెండులక్షల మేర నష్టం జరిగినట్లు రైతు అచ్చయ్య తెలిపారు. ఫైరింజన్ సహాయంతో సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

భారీ వర్షం.. గాలి దుమారం

- నగర వ్యాప్తంగా పడిపోయిన వృక్షాలు,విద్యుత్ స్థంభాలు
- సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7.30వరకు విద్యుత్ అంతరాయం
- విరిగి పడిన హోర్డింగులు, పొంగిన డ్రెయిన్లు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే 6(ఆంధ్రజ్యోతి): గాలి దుమారం.. రాళ్లవర్షానికి నగరం అతలాకు తలమైంది. ఒక్కసారిగా వచ్చిన గాలి తీవ్రతకు 7,21,26,49 డివిజన్లలో వృక్షాలు నేలకూలాయి. 53వడివిజన్‌లో మూడువిద్యుత్ స్తంభాలు పడిపోయాయి. జడ్పీక్వార్టర్స్ వృక్షాలుపడిపోయి నివాసాల నుంచి ఉద్యోగులు బయటకు రావటానికి ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలపై భారీ ఫ్లెక్సీలు పడటంతో విద్యుత్ షార్టు సర్క్యూట్‌కు గురైంది. 20కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని విద్యుత్‌శాఖ అధికారులు గుర్తించారు. కాగా ఖమ్మం నగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు రాత్రి 10గంటల వరకు పనిచేశారు. పడిపోయిన వృక్షాలను యాంత్రాలతో కట్ చేసి రహదారులను క్లీయర్ చేశారు. విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీలను తొలగించారు.



పాతబస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన కూడలి వద్ద వరద

నగరంలోవాతావరణ బీభత్సం..

ఖమ్మంసాంస్కృతికం:గాలిదుమారానికి రేకుల షెడ్లు, బడ్డీ కొట్లు, తదితర తాత్కాలిక నివాసాల వారు హడలిపోయారు.. మురుగు కాల్వలు పొంగి ప్రవహించటంతో ద్విచక్రవావనదారులు, నడిచి వెళ్లేవారు బురద నీటిలో చిక్కుకుపోయి అగచాట్లకు గురయ్యారు. పాత బస్టాండ్‌లోకి వరద నీరు చేరటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మామిళ్లగూడెం రైల్వేఅండర్ బ్రిడ్జివద్ద వరదనీరు చేరటంతో మామిళ్లగూడెం, సారధినగర్ ప్రాంతాల ప్రజలకు రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురయ్యాయి.









మామిళ్లగూడెం ఆర్‌యూబీ వద్ద వరద, గాలి వానకు పడిపోయిన విద్యుత్ స్తంభం, చెట్లు, కూకటి వేళ్లతో నేలకూలిన చెట్లు, గాలివాన బీభత్సం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పనుల్లో నాణ్యత ఉండాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, భవిష్యత్ నగర విస్తరణ దృష్టిలో ఉంచుకొని పనులు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 46వ డివిజన్‌లో రూ.34లక్షలపనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.నగరం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను వివరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని, పరిశుభ్రతా చర్యలను పాటటించాలని,తడి,పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులను కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేసి నాణ్యతాలోపాలుంటే వెంటనే కేఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి తుమ్మల ఖమ్మం నియోజకవర్గానికే పరిమితం కావటం లేదన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా తనదైన మార్కును చూపుతున్నారన్నారు.అదనపు కలెక్టర్ పీ.శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ కన్నంవైష్ణవి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాదు రమేశ్‌రెడ్డి, కన్నం ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

9 నుంచి గుట్ట ఆలయ బ్రహ్మోత్సవాలు

ఖమ్మంఖానాపురంహవేలి,మే5(ఆంధ్రజ్యోతి):నగరంలోని స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ (గుట్ట)వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 13వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కొత్తూరు. జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 9న సాయంత్రం దీక్షాదారణ, అంకురార్పణ, 10న సుదర్శనయాగం, 11న స్వామి వారి జన్మనక్షత్రం, నరసింహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, సాయంత్రం గిరి ప్రదక్షణ,నృసింహ స్థంబోద్భవ దర్శనం, 12న, 108 కలశములతో అభిషేకం, ముత్యాల తంబ్రాలు ఊరేగింపు, సాయంత్రం స్వామి వారి కల్యాణం,13న వసంతోత్సవం, చక్రస్నానం తోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వర్షాకాలం నాటికి అంతర్గత రోడ్ల నిర్మాణం

- రెండు కళ్లలా అభివృద్ధి సంక్షేమం
- రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి

కూసుమంచి,మే6(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నాటికి గ్రామాల్లో అంతర్గత రహదారులను పూర్తి చేస్తామని రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కూసుమంచి మండలంలోని నేలపట్ల, మల్లేపల్లి, జక్కేపల్లి ఎస్సీకాలనీల్లో రూ.80లక్షలతో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.15 కోట్లతో సూర్యాపేట-ఖమ్మంరోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. నేలపట్ల గ్రామంలో హైటెన్షన్ వైర్లను తొలిగిస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాఖుబ్, ఇరిగేషన్ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, భగీరథ ఈఈ పుష్పలత,ఏడీఏ సరిత, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, పలువురు అధికారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదల్లో చిరునవ్వు చూడడమే లక్ష్యం

ఖమ్మంరూరల్: పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన సాగిస్తుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. పలుఅభివృద్ధి పనులకు శంకుస్థాపనచేశారు. తల్లంపాడు గ్రామంలో ఎస్సీకాలనీలో సీసీరోడ్లు, పాలేరు గ్రామంనుంచి సూర్యాపేట-ఖమ్మం రోడ్డుకు సెంట్రల్‌లైటింగ్, మారెమ్మగుడి నుంచి కేంద్రియ విద్యాలయ రోడ్డు కరుణగిరి జంక్షన్ వరకుపనులకు, గోళ్లపాడు గ్రామంలో సీసీ రోడ్లుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రతీ గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి పనులు సైతం చేపట్టామని చెప్పారు. గోల్లపాడులో రోడ్డు విస్తరణ పనులకు ఒప్పుకొని స్థలాలు ఇచ్చిన ప్రజలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పెద్దతండాలో మంత్రి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మీ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం–సూర్యాపేట రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

- చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంరూరల్,మే6(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవద్దని పండించిన నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజవరకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుదిమళ్లలో ప్యాక్స్ ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు స్వచ్ఛందంగా నాణ్యమైన వడ్లను తీసుకువచ్చారని తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోత విధించకూడదని సెంటర్ నిర్వాకులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాలు, ధాన్యం నష్టం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనఖీలు చూస్తూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఏదశలోనూ రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.



గుదిమళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రాజీవ్ యువ వికాసంపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్: రాజీవ్‌యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. దరఖాస్తుల గురించి కలెక్టర్ మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ధృవీకరణ 90 శాతంపైగా పూర్తయిందన్నారు. జూన్ 2నుంచి యూనిట్ల గ్రౌండింగ్ పై దృష్టిసారించాలన్నారు.దివ్యాంగులకు, మహిళలకు, అతిపేదలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని అన్నారు.ఈసమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీఈవో సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారులు, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, మే6 (ఆంధ్రజ్యోతి): మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో కోర్సులకు అర్హులైన వారు ఈనెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కేసర. రాంగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన ఆడపిల్లలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, బాలల సదనం, మహిళ సంస్థలలో ఆశ్రయం పొందిన బాలికలు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుతోపాటు జత చేసి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో మే 18లోగా అందించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నివారించాలి

సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ

తిరుమలాయపాలెం, మే6(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో జాప్యం లేకుండా ప్రతీ గింజను కొనుగోలు చేసి రైతులకు మేలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ అన్నారు. మంగళవారం మండలంలోని హైదరసాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులు పంటను కొనుగోలు కేంద్రానికి తెచ్చి 15రోజులవుతున్నా.. కాంటాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కొనుగోలులో జాప్యాన్ని అరికట్టాలన్నారు. అలాగే హైదరసాయిపేట గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చింతోజు వెంకటాచారి స్మారకస్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు ఎస్‌డీ బషీరుద్దీన్ కొమ్ము శ్రీను,దాసరి మహేందర్, సుధాకర్, వీరభద్రం, వెంకన్న పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థులకు డీఈవో అభినందన

ఖమ్మంఖానాపురంహవేలి, మే5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థి ముత్యాల అఖిలేష్ 592 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. మంగళవారం జిల్లావిద్యాశాఖ అధికారి సామినేని. సత్యనారాయణ విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగిదేశానికి సేవలు అందించాలని సూచించారు. విశాల్, శ్రీవిద్య, తన్మయిసాయిను డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టీఎల్ఎన్. శర్మ పాల్గొన్నారు.



అక్షరాస్యత పెంచేందుకు కృషి చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, మే6(ఆంధ్రజ్యోతి):అక్షరాస్యత పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్య, వయోజన విద్య శాఖపై అధికారులతో సమీక్షించారు. నిరక్షరాస్యత తొలగించే దిశగా ప్రతీఒక్కరికి చదవడం,రాయడం రావాలని కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటీరసి ప్రోగ్రాం ను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 50 వేలకు పైగా ఉన్న నిరక్షరాస్యులకు ఉల్లాస్ కార్యక్రమం అమలుకు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. మండలంలో ఉల్లాస్ కార్యక్రమంపై రివ్యూ నిర్వహించి వలంటీర్లను గుర్తించాలన్నారు. జూన్ 2వరకు ప్రతీ విద్యార్థికి ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేయాలన్నారు. బడిబాట కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, పాఠశాలల హెడ్మాస్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు తుంబూరు నృసింహస్వామి కల్యాణం

సత్తుపల్లిరూరల్, మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబూరులో వేంచేసియున్న భూసమేత లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో 5రోజుల పాటు జరిగే బ్రహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమైనాయి. శ్రీవైఖానస శాస్త్రయుక్తంగా శ్రీతరునఘరి పవన్‌కుమార్ ఆచార్యుల వారి బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదగోష్ఠి తదితర పూజలు నిర్వహించారు. 8న శ్రీభూసమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

ఖమ్మంలీగల్,మే6ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ బైపాస్‌రోడ్ ప్రాంతానికి చెందిన డి.శ్రీనివాసరావుకు చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.7లక్షల50వేల నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన ఫిర్యాది ఎస్.రామయ్య వద్ద నిందితుడు రూ.5లక్షలను 2017లో అప్పుగా తీసుకున్నాడు. 2019లో రూ.7లక్షల50వేల రూపాయలకు చెక్కు జారీ చేశాడు. చెక్కును ఫిర్యాది బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేనందునచెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది వేగినాటి నాగేశ్వరరావు ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసుదాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావటంతో పైవిధంగా తీర్పుచెప్పారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించిన సీపీ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన యండి.హనీఫ్ కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.14,98,610 భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైనా పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు.



చెక్కు అందిస్తున్న సీపీ

15లోగా డీఈఐడీకి దరఖాస్తు చేసుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి,మే5(ఆంధ్రజ్యోతి):టీజీడీఈఈ సెట్ ద్వారా డీఈఐడీ(డిప్లొమా ఇన్‌ఎలిమెంట్రీ ఎడ్యుకేషన్)డీపీఎస్‌ఈ (డిప్లొమాఇన్‌ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్, డీఈవో కె. సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు కంప్యూటర్ బేస్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడిఖమ్మం జిల్లా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాలలో కామర్స్ అధ్యాపకుడు జిల్లా.రాంప్రసాద్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి ఉత్తర్వులు జారీచేశారని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఓయు కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. సంధ్యారాణి పర్యవేక్షణలో పరిశోధనా సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి నందుకు డాక్టరేట్ ప్రదానం చేశారని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణ చేస్తే చర్యలు

తిరుమలాయపాలెం తహసీల్దార్ సుధీర్



తిరుమలాయపాలెం, మే6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.సుధీర్ హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఆకేరు, పాలేరు నదులనుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనదారులపై కేసు నమోదుతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా నిలవ ఉంచిన ఇసుక డంప్‌లను కూడా స్వాధీనం చేసుకుని వేలం వేస్తున్నట్టు తెలిపారు. మండలంలో కొత్తరేషన్‌కార్డుల దరఖాస్తులు,చేర్పులమార్పులకోసం సుమారు 6500మంది దరఖాస్తు చేశారని, వీటిని పరిశీలించి అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందిస్తామన్నారు.నిజమైన లబ్ధిదారులకు అందేలా రెవెన్యూ సిబ్బందిని మూడు టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. సర్వే చేపట్టి వాటి ఆధారంగా కార్డులు అందిస్తామన్నారు.

లారీ డ్రైవర్‌కు మూడేళ్ల జైలు

సత్తుపల్లిరూరల్,మే6 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో అజాగర్తగా లారీ నడుపుతూ ఇద్దరు మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు సత్తుపల్లి కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఓడిస్సా రాష్ట్రానికి చెందిన హర్షిత్‌రాయ్ గతేడాది జూన్ 3న హైదరాబాద్ నుంచి ఆంధ్రాలోని వైజాగ్ కు పైపుల లోడుతో వస్తున్నాడు. అదేసమయంలో సత్తుపల్లి మం డలం కిష్టారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు పిల్లి పేరయ్య (55), అశోక్‌కుమార్ (35) స్వగ్రామం వెళ్తున్నారు. కిష్టారం ఓసీ సమీపంలోకి రాగానే మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ ఢీకొనడంతో అక్కడికక్కడే తండ్రీకొడుకులు మృతిచెందగా పట్టణ సీఐ టీ.కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జీ షేక్ మీరా ఖాసీం సాహెబ్‌పై విధింగా తీర్పును ఇచ్చారు.

భూగర్భ విద్యుత్ లైన్లకు సర్వే

మధిరటౌన్, మే6 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో విద్యుత్ సరఫరాను భూగర్భ కేబుల్ ద్వారా సరఫరా చేసేందుకు మంగళవారం మధిరలో సర్వే నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్‌ఈ శ్రీనివాసచారి తో పాటు మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు హైదరాబాద్‌కు చెందిన ఎజన్సీ వారు చేపడుతున్న సర్వేను పరిశీలించారు.తొలత ఆత్కూర్ సర్కిల్ నుంచి నందిగామ బైపాస్ రోడ్డు వరకు, ఆర్‌వీ కాంప్లెక్స్ నుంచి అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం సర్వే బృందం పరిశీలించారు. ఏడీఈ అనురాధ, మునిసిపల్ డీఈ నరేష్ రెడ్డి, ఆర్‌అండ్‌బీఏఈ రాంబాబు పాల్గొన్నారు.

గీతామందిరంలో భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం

సత్తుపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న గీతాజ్ఞానమందిరంలోని ఏకోనవింశతి (19వ) అధ్యయనోత్సవ సహిత రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారధి స్వామి వారి బ్రహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో మహాయజ్ఞం కన్నులపండువగా సాగింది. అదేవిధంగా ఆరాధన, బాలభోగ నివేదన, చతుస్థానార్చన, నిత్యహవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, మహా నివదేన, తీర్థప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారధి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు జరిపించారు.

ఉందిలే మంచి కాలం ముందు ముందునా..

డీ లిమిటేషన్‌పై ఆశలు పెట్టుకున్న నాయకులు

సత్తుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గాల పునర్విభజనపై కొందరు నాయకులు ఆశలు పెంచుకుంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో కొందరు నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంపై పాత తరం నాయకులతో పాటు యువ నాయకులు కూడా ఆశలు పెంచుకుంటున్నారు. ఈ క్రమంలో వీలు దొరికినప్పుడల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో పర్యటనకు సమయం కేటాయిస్తున్నారు. ఒక పక్క తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై కోర్టులో వాదోపవాదనలు జరుగున్న క్రమంలో కూడా కొందరు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజకీయంగా తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు.

2009 నుంచి సత్తుపల్లి రిజర్వుడు నియోజకవర్గం

1952 నుంచి వేంసూరు కేంద్రంగా ఉన్న నియోజకవర్గం 1972 ఎన్నికల తరువాత సత్తుపల్లి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గంగా మారింది. 1952 నుంచి 2009 వరకూ జనరల్ స్థానంగా ఉన్న సత్తుపల్లి 2009 నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా కొనసాగుతోంది.

పునర్విభజనపై ప్రచారం

లోక్‌సభ స్థానాల పునర్విభజన జరుగుతున్న ప్రచారంలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగబోతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ నాయకులు ఎవరికి వారు నియోజకవర్గాలకు సంబంధించి కొత్త నియోజకవర్గాలు ఏర్పాటవుతాయని, ఉన్న నియోజకవర్గాల్లో కొన్ని మండలాలు కొత్త నియోజకవర్గాల్లో కలుస్తాయని లెక్కలేసుకుంటున్నారు. ఇందులో భాగంగా పునర్విభజన జరిగితే సత్తుపల్లి కేంద్రంగా ఉండే నియోజకవర్గం జనరల్ స్థానంగా మారే అవకాశం ఉందని కొందరు బావిస్తున్నారు.

సత్తుపల్లిపై దృష్టి సారించిన నాయకులు

నియోజకవర్గాల పునర్విభజనలో సత్తుపల్లి జనరల్ స్థానంగా మారనుందని బావిస్తున్న కొందరు ఆశావహులు ఈ నియోజకవర్గంలోని కొన్ని మండలాలపై దృష్టి సారించారు. గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన నాయకులతో పాటు, గతంలో ఇక్కడ పోటీ చేసిన నాయకులు కూడా సత్తుపల్లిపై మనసు పడుతున్నారు. సమయం దొరికిన ప్రతిసారి ఈ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటిస్తూ శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఓ యువ నాయకుడు తనకున్న పరిచయాలతో పాటు కొత్త కేడర్‌ను తయారు చేసుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది. మరో యువ నాయకుడిని కొందరు ప్రమోట్ చేసే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక మాజీ ఎమ్మెల్యే సత్తుపల్లి జనరల్ స్థానం అయ్యే అవకాశం ఉందని నమ్ముతూ వివిధ పార్టీల్లో కొనసాగుతున్న తన అనుచరులతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. గతంలో సత్తుపల్లిలో పోటీ చేసిన నాయకుడొకరు సత్తుపల్లి నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించారు. సింగరేణి బాధితుల సమస్యలపై ఆయన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సత్తుపల్లి జనరల్ స్థానంగా మారితే తమ భవిష్యత్తు ఏమిటని బావిస్తున్న ఎస్సీ సామాజిక వర్గం నాయకులు కొందరు కల్లూరు, తల్లాడ మండలాలపై దృష్టి సారించారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం జరిగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభను విజయవంతం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పెనుబల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ తోపాటు ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావ్, కోటగిరి సుధాకర్ రావు, చెక్కిలాల మోహన్‌రావు, వంగా గిరిజాపతిరావు, లక్కినేని వినీల్ పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ స్పీకర్‌గా ధనలక్ష్మి



సర్టిఫికెట్ అందుకుంటున్న ధనలక్ష్మి

ఎర్రుపాలెం, మే6 (ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫైడ్ స్పీకర్‌గా ఎర్రుపాలెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల తెలుగు బోధకురాలు తేజావత్ ధనలక్ష్మిని ఎంపికచేసినట్టు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస సంస్థ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న శిక్షణలో ధనలక్ష్మి పాల్గొన్నారు. జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి అంశాలతోపాటు విద్యార్థుల్లో కేరీర్ గైడెన్సు యువతలో పర్సనాలిటీ మేనేజ్‌మెంట్, వయోజనుల్లో వృత్తిపరమైన వ్యక్తిగత సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుందని ధనలక్ష్మి తెలిపారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ఇంపాక్ట్ ఫౌండేషన్‌కు, నిపుణుడు గంపా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈఎస్ నాగేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం వైరా ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో వారు మాట్లాడారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటుచేసి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని తెలిపారు. నిరంతరం ఆర్టీసీ బస్టాండ్లు ఇతర చోట్ల బస్సులు, అనుమానం ఉన్న కార్లు ఇతర వాహనాలను తనిఖీ చేసి గంజాయిని పట్టుకుంటున్నామని ఇకముందు కూడా మరింత పకడ్బందీగా గంజాయి నిరోధానికి ఎక్సైజ్‌శాఖ పనిచేస్తుందని వివరించారు. శిథిలావస్థలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను వేరే భవనంలోకి మార్చేందుకుగల అవకాశాల గురించి చర్చించారు. పూర్వపు పంచాయతీ కార్యాలయ భవనాన్ని, ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుచేసేందుకుగల అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భూగర్భ విద్యుత్ లైన్లకు సర్వే



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

మధిరటౌన్, మే6 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో విద్యుత్ సరఫరాను భూగర్భ కేబుల్ ద్వారా సరఫరా చేసేందుకు మంగళవారం మధిర పట్టణంలో సర్వే నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ శ్రీనివాస చారి తో పాటు మునిసిపల్, అర్అండ్‌బీ అధికారులు హైదరాబాద్ కు చెందిన ఏజన్సీ వారు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. తొలత ఆత్కూర్ సర్కిల్ నుంచి నందిగామ బైపాస్ రోడ్డు వరకు, ఆర్‌వీ కాంప్లెక్స్ నుంచి అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం సర్వే బృందం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ అనురాధ, మునిసిపల్ డీఈ నరేష్ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఏఈ రాంబాబు ఇతర విద్యుత్ అదికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కొణిజర్ల, మే6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా ఇల్లు ఇస్తామని, అర్హులను ఒక్కరిని కూడ నష్టపోనివ్వమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కొణిజర్లలో రూ. 5 కోట్లతో బీటీ రోడ్డుకు, చిన్నగోపతి, గోపవరం, కొండవనమాల, చిన్నమునగాల గ్రామాలలో సీసీ రోడ్లకు శంకుస్థానలు చేశారు. రాజ్యాతండా ప్రగతినగర్‌లో, కాచారం గ్రామాలలో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్లకు అప్పులు పాలు చేశాడని, ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6500 కోట్లు చెల్లిస్తూ వస్తుందన్నారు. సర్పంచ్‌లకు కూడా బిల్లులు ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, జిల్లా మంత్రులు, ఎంపీల సహకారంతో వైరా నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తలవంచి పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు అపోహలకు పోవద్దని, నియోజకవర్గంలోని అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు. దేశంలోనే రైతులకు గిట్టుబాటు ధర, ధాన్యంకు బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, మాజీ ఎంపీపీ గోసు మధు, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, నెల్లూరు రమేష్, కోసూరి శ్రీనివాసరావు, మస్తాన్, బాలాజీ ఏసేట్ చైర్మన్ వత్సవాయి రవి, రాయల పుల్లయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, పోట్లపల్లి శ్రీనువాసరావు, జిల్లా మహేష్, ముత్తయ్య, చెరుకుమల్లి రవి, పరికపల్లి శ్రీను, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాము, ఎంపీడీవో రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలానికి సంబంధించి కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం రూ. 96 లక్షలు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయగా, రూ 23 లక్షలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమానికి ముందు చిన్నమునగాల, కాచారం, చిన్నగోపతి, కొండవనమాల గ్రామాలలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని పాదయాత్రగా ఎమ్మెల్యే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుపుతాం

రైతుల ఆందోళనలతో స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారులు



కేంద్రాన్ని సందర్శిస్తున్న అధికారులు

కల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు కల్లూరు ఆర్డీఓ ఎల్ రాజేంద్రగౌడ్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లయ్యబంజర ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీలత, డీపీఎం దర్గయ్య, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్యలతో కలిసి ఆర్డీవో రాజేంద్రగౌడ్ సందర్శించారు. సోమవారం పుల్లయ్యబంజర రైతులు ధాన్యం కొనుగోళ్లు జరపటం లేదని అధికారుల తీరును నిరసిస్తూ కల్లూరులో ఆందోళన చేపట్టగా ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ కేంద్రంలో ధాన్యం కొనుగోలు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పై విధంగా జిల్లా అధికార యంత్రాంగం కదిలి వచ్చింది. ఈ సందర్భంగా వారు పుల్లయ్యబంజర కేంద్రంలో తుర్పార పట్టిన ధాన్యం రాశులను పరిశీలించి ఇక్కడ సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో ఇంక ఏ మేరకు ధాన్యం నిల్వలు ఉన్నాయి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజేంద్రగౌడ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పుల్లయ్యబంజర కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యంను వేగంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించ వద్దని కేంద్రం ఇన్చార్జిలను వారు ఆదేశించారు. ధాన్యం కాంటాల్లో తరుగులు లేకుండా చూడాలని తూర్పార బట్టిన ధాన్యంను తేమ శాతం నిర్ధారణతో త్వరత గతిన కొనుగోళ్లు చేయాలన్నారు. రైతులకు అవసరమైన లారీలు, గన్ని సంచులు అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లపై తన పర్యవేక్షణ ఉంటుందని ఎలాంటి ఇబ్బందులు ఎదురైన రైతులు నేరుగా తమ కార్యాలయంలో సమాచారాన్ని అందించాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, తహసిల్దార్ పి సాంబశివుడు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెను జయప్రదం చేయండి

సత్తుపల్లిరూరల్, మే6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరుగు ఒక్కరోజు టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జేవీఆర్ ఓసీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ పోరాటం ద్వారా సాధించుకున్న 44చట్టాలలో 29చట్టాలు కార్మికులకు అనుకూలంగా ఉండగా వాటిని 4లేబర్ కోడ్స్‌గా మార్చడం, వాటిని సైతం యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే వీకేఓసీ, సత్తుపల్లి ఓసీ-3లో ఓబిని ప్రయివేట్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, బొగ్గును సైతం సంస్థ ద్వారా తీసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త గనులను ప్రారంభించాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీ.వీరాస్వామి, సముద్రాల సుధాకర్, జే.గట్టయ్య, దారా బీమయ్య, సూర్యప్రకాష్, నరసింహారావు, శ్రీధర్, సుధాకర్, బద్రు, శ్రీను, మధుకుమార్, వెంకటేశ్వరరావు, సురేష్, శంకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మధుసూధన్‌రావు

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల కోసం జీవితాంతం పోరాడిన నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు సంక్రాంతి మధుసూదన్‌రావు చిరస్మరణీయుడని వైరా వ్యకా.సం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నివాళులర్పించారు. మధుసూదన్‌రావు పోరుబాటలో పయనించి ఆయన ఆశయాలను సాధించాలని కోరారు. సీపీఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభ చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగింది. వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 11న లాలాపురంలో మధుసూదన్‌రావు స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తామని కూడా ప్రకటించారు. మధుసూదన్‌రావు చిత్రపటానికి వెంకట్ ఇంకా పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన ఆశయాల సాధనే మరం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు బొంతు రాంబాబు, బొంతు సమత, సంక్రాంతి రవికుమార్, సుంకర సుధాకర్, కొంగర సుధాకర్, పాపగంటి రాంబాబు, తోట కృష్ణవేణి, మల్లెంపాటి రామారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పున్నం చందర్ కోరారు. మండలంలోని తూటికుంట్ల, సీతానగరం గ్రామాల్లో మంగళవారం రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. రెండు గ్రామాల్లో 120 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టం ద్వార రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, నిషేద భూములకు సంబంధించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్లు మైథిలి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తుంబూరు నృసింహస్వామి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్, మే6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబూరులో వేంచేసియున్న భూసమేత లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో 5రోజుల పాటు జరిగే బ్రహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమైనాయి. శ్రీవైఖానస శాస్త్రయుక్తంగా శ్రీమాన్ శ్రీ తరునపురి పవన్‌కుమార్ ఆచార్యుల వారి బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్షాస్వీకరణ, పంచగవ్యప్రాశన, ముత్సగ్రహణ, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తుహోమంతో గరుడ ప్రతిష్ఠ ధ్వజారోహణ, తీర్థప్రసాదగోష్ఠి తదితర పూజలు నిర్వహించారు. కాగా 8న శ్రీ భూసమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

లారీ డ్రైవర్‌కు మూడేళ్ల జైలు

సత్తుపల్లిరూరల్, మే6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అజాగ్రత్తగా లారీ నడుపుతూ ఇద్దరు మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు సత్తుపల్లి కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన హర్షిత్‌రాయ్ గతేడాది జూన్ 3వ తేదీన హైదరాబాద్ నుంచి ఆంధ్రాలోని వైజాగ్‌కు పైపుల లోడుతో వస్తున్నాడు. అదే సమయంలో సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు పిల్లి పేరయ్య (55), అశోక్‌కుమార్ (35)లు స్వగ్రామం వెళ్తున్నారు. కిష్టారం ఓసీ సమీపంలోకి రాగానే మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ ఢీకొనడంతో అక్కడికక్కడే తండ్రీకొడుకులు మృతిచెందగా పట్టణ సీఐ టీ.కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో సాక్షులను విచారించిన సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జీ షేక్ మీరాఖాసీం సాహెబ్ పై విధంగా తీర్పును ఇచ్చారు.

ఫిజియో థెరపీ శిబిరం

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. వేసవి సెలవులైనప్పటికీ ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహిస్తామని కొత్తపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. పాక్షిక పక్షపాతం, నడకలో సమస్యలు, ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సూచించారు. ఫిజియోథెరపిస్టు వి.వసంత, ప్రత్యేక ఉపాధ్యాయులు రవి, వి.అజిత పాల్గొన్నారు.

రోహింగ్యాలను పంపించివేయాలి

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా భారతదేశంలోకి అక్రమంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుంచి చొరబడిన రోహింగ్యాలను తిరిగి వారి దేశాలకు పంపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆదేశాలతో ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ, దోసపాటి కల్యాణ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏసీపీ ఎంఏ. రెహ్మాన్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. భారతదేశంలో అలాగే తెలంగాణ రాష్ట్రంలో చొరబడిన రోహింగ్యాలను గుర్తించి వారి దేశాలకు తిరిగి పంపించాలని కోరారు.

ఆసుపత్రి తనిఖీ

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మురళీకృష్ణ హాస్పిటల్‌ను మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సైదులు, డీఈఎంవో సాంబశివారెడ్డి తనిఖీ చేశారు. హాస్పిటల్‌లోని స్కానింగ్ సెంటర్, రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ తీసిన ప్రతి పేషెంట్‌కు ఎఫ్ ఫారం తప్పనిసరిగా రాయాలని సూచించారు. సీ సెక్షన్ ఆడిట్ ఫామ్స్ అలాగే లేబరేటరీని తనిఖీ చేశారు. క్వాలిఫైడ్ టెక్నీషియన్స్‌ను ఉంచాలని, ల్యాబ్ టెస్టుల ధరల పట్టికను రోగుల వెయింటింగ్ హాల్‌లో ప్రదర్శించాలని సూచించారు. హాస్పిటల్ డాక్టర్లు కాపా మురళీకృష్ణ, చంద్రకళ తమ హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్యసేవల గురించి వారికి వివరించారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

వైరా, మే 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఐదోవార్డు సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ మాదినేని సునీత, రాయల అన్నపూర్ణ, రోజా, వజినేపల్లి సునీత, రాయపూడి రజిని అన్నదానాన్ని ప్రారంభించారు. మందిర నిర్వాహకులు లగడపాటి బోస్, మాదినేని దుర్గాప్రసాద్, మిద్దే సుబ్బారావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, తల్లపురెడ్డి కృష్ణారెడ్డి, శ్రీరామనేని శ్రీనివాసరావు, పి.ఉపేంద్రరావు, మిట్టపల్లి నర్సింహారావు, శ్యామ్, సీహెచ్.వెంకటేశ్వరరావు, సీహెచ్.శ్రీనివాసరావు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమ్మెను విజయవంతం చేయండి

కారేపల్లి మే6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ అసోసియేషన్ సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సర్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మండల సీఐటీయూ కార్యదర్శి కె.నరేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మెడికల్ ఆఫసర్ సురేష్‌కు ఆశవర్కర్లతో కలిసి సమ్మెనోటీసు ఇచ్చారు.ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29కార్మికచట్టాలను రద్దుచేసి4లేబర్ కోడ్‌లుగా తీసుకవచ్చి వాటి అమలుకు కేంద్రలోని బిజేపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని ఆరో పించారు.సమ్మెను అన్ని వర్గాలవారు మద్దతు ఇవ్వాలన్నారు.

పాకిస్తాన్ వలసదారులను గుర్తించాలి

ముదిగొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్, బంగ్లాదేశ్ వలసదారులను గుర్తించాలని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎస్ఐ కృష్ణప్రసాద్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అక్రమంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడ నివాసముంటున్న వారిని గుర్తించి తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలసదారులను గుర్తించి వారి దేశాలకు పంపించాలన్నారు. ఈ విషయమై అవసరమైన చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. వలసదారులను తిప్పి పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్, వున్నం వెంకయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి టీబీ పరీక్షలు

తల్లాడ, మే6 (ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్న మనోహర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బందికి టీబీ పరీక్షలు జరిపారు. నిత్యం టీబీ వ్యాధిగ్రస్తుల మధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి టీబీ వ్యాధి నిర్ధారణ కోసం పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్న మనోహర్ మాట్లాడుతూ ప్రజలు కూడా తమకు కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా టీబీ వ్యాధి ఉంటే ఆకుటుంబసభ్యులు కూడా ముందుగానే టీబీ రీక్షలు చేయించుకోవాలని కోరారు. టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులు స్వచ్ఛందంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోపరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో భాస్కర్, హెల్త్‌సూపర్‌వైజర్లు కె. పెద్దపుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.